క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి వినతి



ఎస్టీఓకు వినతి పత్రం ఇస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ఉదయగిరి : ఉదయగిరి సబ్‌ట్రెజరీ కార్యాలయ పరిధిలో విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని గాజులపల్లి రామిరెడ్డి, షేక్.జాఫర్ అహ్మద్‌లు మంగళవారం ఎస్టీఓ ఉస్మాన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యాలయానికి నిత్యం ఎంతో మంది విశ్రాంత ఉద్యోగులు వస్తుంటారన్నారు. అధికారులు రెండో అంతస్తులో ఉండి కార్యాలయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్నారు. దీంతో మెట్లు ఎక్కి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారన్నారు. కింది గదిలో ఒక కంప్యూటర్, ఉద్యోగిని ఏర్పాటు చేసి విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు

ఇంటి స్థలాలు మంజూరు చేయాలి



సచివాలయంలో వినతిపత్రం అందజేత

ఉదయగిరి రూరల్ : మండలంలోని బండగానిపల్లి పంచాయతీలో పేదలకు ఇంటి స్థలాలు, పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేసి పక్కాగృహాలు పొందేలా చూడాలని సీపీఎం ఆధ్వర్యంలో పలువురు పేదలు కోరారు. ఈ మేరకు స్థానిక సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి చినబాబుకు ఎంపీటీసీ సభ్యురాలు కాకు విజయమ్మ మంగళవారం వినతి పత్రం అందజేశారు. సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో కిలో పొగాకు గరిష్ట ధర మంగళవారం రూ.280 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 385 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 317 బేళ్లను కొనుగోలు చేయగా వివిధ కారణాలతో 68 బేళ్లను తిరస్కరించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి టి.ఇషాక్ స్వర్ణదత్ మాట్లాడుతూ కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.200 పలుకగా, సరాసరి రూ.246.88 లభించిందన్నారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

గ్రామ దేవతలకు పొంగళ్ల సమర్పణ



సీతారామపురం : మండలంలోని సంగసానిపల్లిలో గ్రామ దేవతలైన అంకాళమ్మ, పోలేరమ్మ అమ్మవార్లకు మహిళలు మంగళవారం భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టారు. తొలుత వారు ఇళ్ల నుంచి ప్రత్యేక పూజా సామగ్రితో పాటు నైవేద్యాలను గంపల్లో ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయాల వద్దకు చేరుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు. స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల భక్తులు కూడా హాజరయ్యారు.

ఎన్ఎంయూ నూతన కమిటీ ఎన్నిక



సన్మానం అందుకున్న నూతన కమిటీ

ఉదయగిరి : ఉదయగిరి ఆర్టీసీ డిపో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం ఆ సంఘ కార్యాలయ ఆవరణలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఎంయూ డిపో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా షేక్.రియాజ్, ముఖ్య సలహాదారుగా ఎం.వెంకటేశ్వర్లు, చైర్మన్‌గా బి.నాగరాజు, ప్రెసిడెంట్‌గా సీహెచ్.వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్కే విశ్వనాథ్, కార్యదర్శిగా శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం పలువురు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమష్టిగా పోరాడి సాధించుకోవాలన్నారు. చివరిగా నూతన కమిటీని సన్మానించారు. ఈ సమావేశంలో సంఘ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు ఆర్.అంజయ్య, మాజీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రమణరాజు, జిల్లా అధ్యక్షుడు చెంచయ్య, జోనల్, జిల్లా నాయకులు సలాం, రామ్‌కుమార్, మునిరత్నం పాల్గొన్నారు.

వనం.. అక్రమార్కులకు వరం

కొందరు అక్రమార్కులు కాసుల కోసం ఇష్టానుసారంగా చెట్లు, జామాయిల్ కర్రను నరికేస్తున్నారు. ప్రభుత్వ భూమే కదా ఎవరు అడుగుతారులే అని విచ్చలవిడిగా చెట్లను నరికి రవాణా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, అటవీశాఖాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

- ప్రభుత్వ భూముల్లోని చెట్లు, జామాయిల్ నరికివేత
- అడవుల్లో నేలకొరుగుతున్న పచ్చని సంపద
- యథేచ్ఛగా అక్రమ రవాణా
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



ప్రభుత్వ భూమిలో ఖాళీ అయిన జామాయిల్ వనం



దేవమ్మ చెరువు అడవుల్లో అక్రమార్కులు నరికిన చెట్టు

సీతారామపురం : మండలంలోని పడ్రంగి – సింగారెడ్డిపల్లి గ్రామాల నడుమ సుమారు పదెకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ భూమిలో జామాయిల్ ఉన్నాయి. వాటిపై ఎవరి అజమాయిషి లేదనే ఆలోచనతో కొందరు పట్టపగలే కలపను నరికి వాహనాల్లో తరలిస్తున్నారు. ప్రకృతి సహజ వనరుల పరిరక్షణకు ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకొస్తున్నా క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం వాటికి తూట్లు పొడుస్తుండటంతో అక్రమార్కులు యథేచ్ఛగా కలప దోపిడీ చేస్తున్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి, పర్యావరణాన్ని పరిరక్షించాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నప్పటికీ రోజురోజుకీ పచ్చదనం కనుమరుగవుతోంది.

రేంజ్ పరిధిలో..

ఉదయగిరి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో 52,218 హెక్టార్లలో దట్టమైన అడవులు విస్తరించి ఉన్నాయి. మారుమూల ప్రాంతమైన సీతారామపురం మండలంలో 16,214 హెక్టార్లలో అడవులున్నాయి. ఈ క్రమంలో మండలంలోని పంద్రంగి, సింగారెడ్డిపల్లి గ్రామాల పరిధిలోని ప్రభుత్వ భూమిలోగల జామాయిల్ వనాలు అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా గుట్టు చప్పుడు కాకుండా కొందరు అక్రమార్కులు ఈ చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నారు.

చర్యలు తీసుకోని యంత్రాంగం

గతంలో విజయవాడ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఈ ప్రాంతంలో భూములను కొనుగోలు చేసి జామాయిల్ నాటాడు. అలాగే తన భూమి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని సుమారు పది ఎకరాల మేరకు ఆక్రమించుకుని అందులో కూడా జామాయిల్ నాటాడు. కాలక్రమేనా కనిగిరి ప్రాంతానికి చెందిన వ్యక్తి ఆ భూమిని కొనుగోలు చేసి సెటిల్మెంట్ పట్టా వరకు మాత్రమే ఫినిషింగ్ వేసుకుని మిగిలిన ప్రభుత్వ భూమిని వదిలేశాడు. ఆ ప్రభుత్వ భూమిలోని జామాయిల్ చెట్లు బాగా పెరిగి పెద్దవయ్యాయి. ప్రస్తుతం వీటికి మంచి ధర పలుకుతుండడంతో గత కొంత కాలంగా కలప దొంగలు వందలాది చెట్లను నేలకూల్చారు. రాత్రి వేళల్లో వాటిని ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. రెవెన్యూ అధికార యంత్రాంగానికి విషయం తెలిసినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అలాగే దేవమ్మ చెరువు అటవీ ప్రాంతంలో కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా తిష్ట వేసి అటవీ సంపదను సైతం దోచుకుంటున్నారు. చెక్ పోస్టుల వద్ద నిరంతర నిఘాలో ఉండే అటవీ సిబ్బంది భద్రతను గాలికి వదిలేయడంతోనే అటవీ సంపద అక్రమ రవాణా సాగుతుందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. అడవుల్లోని విలువైన వృక్ష సంపదను కాపాడాల్సిన వారే వాటి పరిరక్షణలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ ఉండడంతో ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నట్టు విమర్శలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమార్కుల కలప దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు చేపడతాం



ప్రభుత్వ భూముల్లో అక్రమంగా జామాయిల్ చెట్ల నరికివేతపై పరిశీలించి చర్యలు చేపడుతాం. ప్రభుత్వ సంపదను అక్రమార్కులు కొల్లగొట్టడాన్ని ఏమాత్రం సహించం. వెంటనే గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– పీవీ కృష్ణారెడ్డి, తహసీల్దార్, సీతారామపురం

అడవుల్లోకి ప్రవేశిస్తే చర్యలు



అక్రమంగా అడవిలోకి ఎవరైనా ప్రవేశించి వృక్ష సంపదను తరలిస్తే చర్యలు తప్పవు. అడవుల్లోని చెట్లను నరకడం నిషేధం. చెక్ పోస్టుల వద్ద భద్రత మరింత కట్టుదిట్టం చేసి ప్రతి వాహనాన్ని పరిశీలించిన తర్వాతే పంపేలా చర్యలు చేపడుతాం.

– వెంకటప్రసాద్, డీఆర్వో, సీతారామపురం



అక్రమార్కులు నరికిన జామాయిల్ కర్ర

ఆధార్ లేనివారిని గుర్తించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ

కొండాపురం : మండలంలోని 19 పంచాయతీల్లో ఆధార్ కార్డులు లేని ఎస్టీలను గుర్తించాలని ఎంపీడీఓ ఆదినారాయణ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సర్వే నిర్వహించి ఎస్టీలకు ఎంత మందికి ఆధార్ కార్డులు ఉన్నాయో వివరాలు తీసుకోవాలన్నారు. లేనివారిని గుర్తిస్తే ఆధార్ కార్డులు తీసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆధార్ ఏరియా కోఆర్డినేటర్ మస్తాన్, ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, ఎంఈఓ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న సీఐ, ఎస్సైలు

సంగం : సంగంలోని కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువ వద్ద ప్రమాదాల నివారణకు సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ మంగళవారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఇటీవల ఇక్కడ ఇద్దరు అన్నదమ్ములు, ఓ వృద్ధుడు మృతి చెందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. వేసవిలో పిల్లలు ఈత సరదాలతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కాలువల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

నేటి నుంచి వీరాంజనేయుని మహోత్సవాలు



వెంకటంపేటలోని వీరాంజనేయస్వామి దేవస్థానం

దుత్తలూరు : మండలంలోని వెంకటంపేటలో ఉన్న వీరాంజనేయస్వామి మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు గ్రామ కమిటీ మంగళవారం తెలిపింది. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విశేష పూజలు, అభిషేకాలు, గ్రామోత్సవం, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే నందిపాడులో ఉన్న అభయాంజనేయస్వామి దేవస్థానంలో 22న హనుమజ్జయంతి సందర్భంగా అభిషేకం, పుష్పాలంకరణ, పూజా కార్యక్రమంతో పాటు నందిపాడు, శ్రీరాంనగర్, శ్రీకృష్ణనగర్, బొటికర్లపాడు గ్రామాల్లో గ్రామోత్సవం ఉంటుందన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన



ఉదయగిరి రూరల్: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ షాను



ఏఎస్‌పేట సచివాలయంలో..

ఉదయగిరి రూరల్: మండలంలోని కొండాయపాళెం మినీ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసంపై బాలికలు, తల్లులకు సూపర్‌వైజర్ షాను మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు రక్తహీనత సోకకుండా ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు, ఇబ్బందులు కలుగుతాయన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డలకు వివాహ వయస్సు వచ్చిన తర్వాత వివాహం చేయాలన్నారు. అంగన్‌వాడీల్లో అందించే పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పోక్సో చట్టం, బాల్యా వివాహాల నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

– అనుమసముద్రంపేట : ఏఎస్‌పేట సచివాలయంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లల పట్ల లింగ వివక్ష, అసమానతలు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో పురుషులతో సమానంగా రాణించగలరని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.విజయలక్ష్మి, పి.సావిత్రి, షాకీరా బేగం, జి.ఇందిర, కె.కృష్ణకుమారి, ఎం.సుశీలమ్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి



మాట్లాడుతున్న ఈఆర్వో మురళి

ఉదయగిరి రూరల్ : ఉదయగిరి నియోజకవర్గంలో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎనిమిది మండలాల తహసీల్దార్లు, ఆపరేటర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులతో పాటు చనిపోయిన వారి ఓటర్లను తొలగించి నూతన జాబితాను తయారు చేయాలన్నారు. ఇంటింటికీ తిరిగి తొలగింపులు, చేర్పులు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలో 2,41,444 మంది ఓటర్లుండగా 323 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో ఏఆర్వో సుభద్ర, మండలాల తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జై జవాన్

అల్లూరు : ఆపరేషన్ సిందూర్ విజయవంతానికి హర్షం వ్యక్తం చేస్తూ అల్లూరులో తిరంగ ర్యాలీని మంగళవారం నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి కోనేటి సెంటర్ వరకు ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో జై జవాన్, భారత మాతాకి జై, వందేభారత్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీని కొనసాగించారు. ప్రాణాలకు తెగించి పోరాడిన సైనికులకు ప్రతిఒక్కరూ సెల్యూట్ చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు దేవేళ్ల హరిప్రసాద్‌రెడ్డి, కత్తుల కిరణ్, మల్లికార్జునసింగ్, కార్తీక్ శర్మ, విజయ్, చందు తదితరులు పాల్గొన్నారు.



26న జేవీవీ మండల సమావేశం

సీతారామపురం : స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఈనెల 26వ తేదీ ఉదయం పది గంటలకు జనవిజ్ఞాన వేదిక మండల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు గాజులపల్లి రామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా జేవీవీ జిల్లా బాధ్యులు శ్రీనివాసులు రెడ్డి, చక్రపాణి, దస్తగిరి అహ్మద్‌లు హాజరై మండల కమిటీ ఎన్నికను నిర్వహిస్తారన్నారు.

హనుమాన్ శోభాయాత్రకు తరలిరండి



ఆత్మకూరురూరల్ : పట్టణంలో ఈనెల 25న నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రకు ప్రతిఒక్కరూ తరలిరావాలని కోరుతూ హనుమాన్ శోభాయాత్ర కమిటీ సభ్యులు మంగళవారం పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. మండలంలోని ఆరవేడు జంగాలపల్లి, కరటంపాడు, వెన్నవాడ తదితర గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయా గ్రామస్తులను సమీకరించి శోభాయాత్ర కరపత్రాలను పంపిణీ చేశారు.

భారత్ కళాశాలలో ఉచిత విద్య

కలిగిరి : కలిగిరిలోని భారత్ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు పూర్తి ఉచిత విద్యను అందించనున్నట్లు కరెస్పాండెంట్ మూడా రాజేష్‌బాబు మంగళవారం తెలిపారు. 'బ్రింగ్ ఏ స్మైల్' ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఆవుల విజయ్ గ్రామీణ ప్రాంతంలోని పేద విద్యార్థులను చదివించడానికి ముందుకు వచ్చారన్నారు. ఈ క్రమంలో ఫీజులు లేకుండా విద్యను అందించనున్నామన్నారు. జూన్ 2 నుంచి అడ్మిషన్లు ప్రారంభమవుతాయని డైరెక్టర్ చేరెడ్డి రత్నారెడ్డి తెలిపారు.

పేదలకు అన్నదానం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల కేంద్రంలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను మంగళవారం నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వాసు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పొగాకు విత్తనాల కోసం వివరాల నమోదు

మర్రిపాడు: 2025 – 26 పంట కాలానికి సంబంధించిన విత్తనాలు కావాల్సిన వారు ఈనెల 30వ తేదీలోపు వివరాలు నమోదు చేసుకోవాలని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు ఒక బ్యారెన్‌కు 500 గ్రాముల చొప్పున ఇస్తారన్నారు. వ్యాపార నిమిత్తం నారు అమ్ముకునేందుకు ఒక రైతుకు 400 కిలోల విత్తనాలు ఇస్తామని తెలియజేశారు.

చిలకలమర్రిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సోమశిల : అనంతసాగరం మండలం చిలకలమర్రి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ఎం.సురేష్‌బాబు మంగళవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వ్యవసాయానికి సంబంధించి ఉదయం 6 నుంచి 9 గంటల వరకు సరఫరా ఉంటుందని తెలియజేశారు. ప్రజలు సహకరించాలని కోరారు.

చెరువు ఆక్రమణలపై ఆర్డీఓ పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వంశీకృష్ణ

అల్లూరు : మండల పరిధిలోని పురిణి గ్రామ చెరువులో ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్డీఓ వంశీకృష్ణ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురిణి చెరువు 500 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉందన్నారు. ఈ చెరవులో కొంత మంది ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించామన్నారు. ఆక్రమణదారులతో పాటు గోగులపల్లి ఆయకట్టు రైతులతో మాట్లాడినట్లు వివరించారు. నీటి పారుదలకు ఇరిగేషన్ వారితో సమన్వయం చేసుకుని ఇబ్బందులు రాకుండా చూస్తామన్నారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

ఆత్మకూరురూరల్ : కార్మికులు, కర్షకులు, ఉద్యోగుల హక్కులను పరిరక్షించాలని కోరుతూ సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మకూరు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా నాయకులు శివప్రసాద్, నాగయ్య, కొండమూరి హజరత్తయ్య మాట్లాడుతూ నాలుగు లేబర్ చట్టాలు కార్మికులకు ఇబ్బందికరంగా మారిందని, గతంలో ఉన్న కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా నాయకుడు లక్ష్మీపతి, సీఐటీయూ ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సందానీ, యూటీఎఫ్ నాయకులు శివప్రసాద్, ఎస్‌డబ్ల్యూఎస్ నరసింహులు, అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి రాధమ్మ పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ



ప్రాసెసింగ్ యూనిట్ గురించి రైతులకు వివరిస్తున్న అధికారులు

వింజమూరు(ఉదయగిరి) : మండలంలోని ఊటుకూరు గ్రామంలో రైతులకు పంటల పెంపకంపై విలువ జోడింపు, ప్రాసెసింగ్ అనే అంశంపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నాబార్డు డీడీఎం బాబు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మార్కెట్ లేనందున నష్టాలు వస్తున్నాయని, దీంతో రైతుల ఉత్పత్తులకు విలువ జోడించే నిమిత్తం నాబార్డు సబ్సిడీతో రైతులకు ప్రాసెసింగ్ యంత్రాలు ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామానికి రూ.5 లక్షల విలువ చేసే మిల్లెట్ ప్రాసెసింగ్ యంత్రం సబ్సిడీపై అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ చంద్రభాను, ఏఈ శ్రీహరి నారాయణ, సోషల్ మొబిలైజర్ నాగలక్ష్మి, కో–ఆర్డినేటర్లు ప్రసాద్, వెంకటేశ్వర్లు, టి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హనుమత్ జయంత్యుత్సవాలు ప్రారంభం



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

కావలి (జలదంకి): కావలి మండలం మద్దూరుపాడులో ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం హనుమత్ జయంతి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7 గంటలకు విశ్వక్సేన పూజ, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా మాల్యా గిరిధర్‌రెడ్డి–కామాక్షి దంపతులు వ్యవహరించారు. సాయంత్రం స్వామి వారికి చందనాలంకరణ చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.